నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

కొలనుపాకను సందర్శించిన మహారాష్ట్ర బృందం

కొలనుపాకలో గ్రామపంచాయతీని సందర్శించిన మహారాష్ట్ర అధికారుల బృందం

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని కొలనుపాక గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాల పనితీరును మహారాష్ట్రకు చెందిన అధికారులు సోమవారం పరిశీలించారు. స్థానిక అధికారులతో కలిసి వివిధ శాఖలకు చెందిన పనితీరును విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇండ్లను సందర్శించి ఎంతో బాగున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీఓ సలీం, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

చలో నల్లగొండ

బీఆర్ఎస్ బహిరంగ సభకు సర్వం సిద్ధం

నేడు సాయంత్రం 4గంటలకు ప్రారంభం

మర్రిగూడ బైపాస్‌లో ఏర్పాట్లు

- విశాలమైన సభా వేదిక, ప్రాంగణం
- సభా ప్రాంగణం నలువైపులా పార్కింగ్ స్థలాలు
- ప్రత్యామ్నాయ మార్గంలో సాధారణ వాహనాల మళ్లింపు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగంపై జనంలో అమితాసక్తి

కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతపై బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. సోమవారం రాత్రి వరకే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ బైపాస్ వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారికి ఆనుకుని విశాలమైన స్థలంలో సభకు ఏర్పాట్లు చేశారు. సభా వేదికతోపాటు కళాకారుల వేదిక, గ్యాలరీలు, బారి కేడింగ్ వంటివన్నీ పూర్తయ్యాయి. జిల్లా నేతలతో కలిసి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే సభకు సంబంధించి క్షేత్ర స్థాయి వరకు విస్తృత ప్రచారం కల్పించిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ప్రసంగించనుండడంతో అందరి దృష్టి ఈ సభపైనే కేంద్రీకృతమైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ మొదలుకానున్నది.

- నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ)

నల్లగొండలో సభా వేదికపై పూర్తయిన ఏర్పాట్లు

చలో నల్లగొండ బహిరంగ సభ కోసం హైవేకు ఆనుకుని ఉన్న 50 ఎకరాల విశాలమైన స్థలంలో బీఆర్ఎస్ ఏర్పాట్లు పూర్తి చేసింది. మూడు రోజులుగా చకచకా ఏర్పాట్లు చేస్తూ వచ్చారు. గతంలో ఇదే స్థలంలో నిర్వహించిన నాలుగు సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో తిరిగి అదే స్థలంలో కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై పోరు శంఖం పూరించనున్నారు. హైదరాబాద్ నుంచి కేసీఆర్ రోడ్డు మార్గాన భారీ కాన్వాయ్‌తో నల్లగొండకు చేరుకోనున్నట్లు సమాచారం. చివరి క్షణాల్లో ట్రాఫిక్, ఇతర అంశాల నేపథ్యంలో హెలికాప్టర్‌లోనూ వచ్చే అవకశాలు లేకపోలేదని పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా సభా ప్రాంగణం పక్కనే హెలిప్యాడ్‌ను, అక్కడి నుంచి సభా వేదికకు చేరుకునేలా ప్రత్యేక రూట్‌ను కూడా సిద్ధం చేశారు. సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్లు, మాజీ కీలక ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ముఖ్య నేతలంతా తరలిరానుండడంతో అందుకు అనుగుణంగా విశాలమైన సభా వేదికను నిర్మించారు. ఇక దాని పక్కనే కళాకారుల వేదికను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సభా వేదికకు ఎదురుగా వీఐపీ, మీడియా, మహిళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను సిద్ధం చేశారు. సభకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా బారీ కేడింగ్ చేశారు. వీఐపీల వాహనాల పార్కింగ్‌ను కూడా సభా వేదికకు ఇరువైపులా చేసేలా చర్యలు చేపట్టారు.

నలువైపులా పార్కింగ్‌కు ఏర్పాట్లు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొంటున్న నేపథ్యంలో సభకు పెద్ద సంఖ్యలోనే పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాలతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఎక్కువ మంది హాజరవుతున్నట్లు పార్టీ నేతలు చెప్పారు. వాహనాల పార్కింగ్ కోసం నలువైపులా స్థలాలను సిద్ధం చేశారు. నార్కట్‌పల్లి ప్రాంతం నుంచి వచ్చే వారంతా తమ వాహనాలను పిట్టంపల్లి రోడ్డులోని ఎంఎన్ఆర్ గార్డెన్స్ సమీపంలో నిలిపేలా స్థలం రెడీ చేశారు. దేవరకొండ, మునుగోడు వైపు నుంచి నల్లగొండ పట్టణంలో నుంచి వచ్చే వారు లక్ష్మీ గార్డెన్ సమీపంలోని ఎల్లమ్మ గుడి దగ్గర ఎదురుగా స్థలంలో.. సూర్యాపేట, మిర్యాలగూడ వైపుల నుంచి వచ్చే వాహనాదారులు సభ సమీపంలోనే అద్దంకి-నార్కట్ పల్లి రోడ్డుకు ఇరువైపులా(ఐకేపీ సెంటర్‌లో) వాహనాలు పెట్టే విధంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కేటాయించిన స్థలాల్లో వాహనాలను పార్క్ చేసి సభా స్థలానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

సాధారణ వాహనదారులకు విజ్ఞప్తి

మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి ఏడెనిమిది గంటల వరకు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి సభకు వచ్చి వెళ్లే వాహనాలతో తీవ్ర రద్దీగా మారనుంది. ఈ రూట్‌లో ప్రయాణించాలనుకునే సాధారణ వాహనదారులు ప్రత్యామ్నాయ రూట్‌లో వెళితే మంచిదని సభ నిర్వాహకులు సూచిస్తున్నారు. నార్కట్‌పల్లి వైపు నుంచి నల్లగొండ మీదుగా వెళ్లాలనుకునే వారు వయా నకిరేకల్, తిప్పర్తి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. మిర్యాలగూడ వైపు నుంచి నల్లగొండ మీదుగా నార్కట్‌పల్లి వైపు వెళ్లాలనుకునే వారు వయా తిప్పర్తి, నకిరేకల్ మీదుగా నార్కట్‌పల్లికి వెళ్లాలని సూచిస్తున్నారు. సభకు వచ్చే వాహనాలతో నార్కట్‌పల్లి-అద్దంకి హైవే పూర్తిగా రద్దీగా మారనున్న నేపథ్యంలో ఇతర ప్రత్యామ్యాయ మార్గాలను ఎంచుకోవాలని నల్లగొండ జిల్లా పోలీసులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు. సభకు 500 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఏర్పాట్లపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమీక్ష

సభా ఏర్పాట్లను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డ నేతృత్వంలో జిల్లా నేతలు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం రోజంతా స్థానిక, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన సభా ఏర్పాట్లలో బిజీబిజీగా గడిపారు. వారితోపాటు ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, ఎ.జీవన్‌రెడ్డి, క్రాంతికిరణ్, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ నల్లగొండ ఇన్‌చార్జి రవీంద్ర సింగ్, రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్ రెడ్డి వంటి కీలక నేతలంతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆ సందర్భంగా జగదీశ్‌రెడ్డి వివరించారు.

కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందంలో భాగమే

కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత

- కృష్ణా జలాల వివాదం అనేది తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్య
- బీఆర్ఎస్ పోరాటంతోనే కేఆర్ఎంబీపై కాంగ్రెస్ ప్రభుత్వ తీర్మానం
- కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- నేడు నల్లగొండ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

నల్లగొండలో సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్, చిరుమర్తి, జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రవీంద్రసింగ్, గుత్తా అమిత్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీ కంట్రోల్‌లోకి వెళ్లాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కృష్ణా నదిపై ప్రాజెక్టుల సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు మంగళవారం నల్లగొండలోని మర్రిగూడ బైపాస్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ భారీ బహిరంగ సభ స్థలాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభకు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారన్నారు. పదేండ్లు కృష్ణా ప్రాజెక్టులు కేంద్రం ఆధీనంలోకి పోకుండా కాపాడితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వారికి ధారాదత్తం చేసిందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు మంచి నీటి కోసం రోడ్డు ఎక్కొద్దని, ఫ్లోరోసిస్‌ను రూపుమాపాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకం పెట్టామని, దాని వల్ల ప్రజలకు తాగు నీటి కష్టాలు తప్పడంతోపాటు ఒక్క ఫ్లోరోసిస్ కేసు కూడా నమోదు కాలేదని చెప్పారు. కేఆర్ఎంబీ సమావేశానికి వెళ్లేటప్పుడు సీఎం లేదా మంత్రి వర్గంతో సమీక్ష ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ సభ కోసం కృష్ణా పరీవాహక ప్రాంత రైతులు, ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. సభకు లక్షలాదిగా తరలిరావడం కోసం స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారని చెప్పారు. కేఆర్ఎంబీ కంట్రోల్‌లోకి వెళ్లినా కాంగ్రెస్ సీఎం, మంత్రులు సాగర్ ప్రాజెక్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు సాగర్ ప్రాజెక్టును ఆక్రమించడానికి ఏపీ వస్తే తామే తరిమామని గుర్తు చేశారు. కృష్ణా జలాల వివాదం అనేది తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్య అని అన్నారు. కృష్ణా జలాల హక్కులను కేఆర్ఎంబీకి అప్పజెప్పడాన్ని నాడు ఏపీ ప్రభుత్వం ఒప్పుకొన్నా, బీఆర్ఎస్ సర్కార్ ఒప్పుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ నేతలు ఏపీ నాయకులకు ఏజెంట్లుగా మారి తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణా జలాల హక్కు విషయంలో కేంద్రంపై పోరాడాల్సిందిపోయి కాంగ్రెస్ నేతలు తమపై ఎదురుదాడి చేయడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాల హక్కులపై బీఆర్ఎస్ పోరాటంతోనే కేఆర్ఎంబీకి అప్పగించలేదని కాంగ్రెస్ తీర్మానం చేసిందని, కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని చెప్పారు. తెలంగాణ ప్రజలు మరోసారి నీటి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని, నేడు నల్లగొండలో నిర్వహించే సభకు పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సభకు రైతులు స్వచ్ఛందంగా తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి

కృష్ణా ప్రాజెక్టులను కాపాడు కోవాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాల్సిన అవసరం ఉందని, నల్లగొండలో నిర్వహించే సభకు రైతులంతా పార్టీలకతీతంగా కదిలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండలో కోమటిరెడ్డి టీమ్ నిరసనలు చేసినంత మాత్రాన ఎవరూ పట్టించుకోరని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వెళ్తున్నందున వారి నుంచి నిరసన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్ రెడ్డి, చీర పంకజ్ యాదవ్, కొండూరు సత్యనారాయణ, మాలె శరణ్యారెడ్డి, యాట జయప్రదారెడ్డి పాల్గొన్నారు.

కృష్ణానది ప్రాజెక్టులపై కాంగ్రెస్ దొంగ నాటకం

- ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి పాలన
- వేలాదిగా తరలివచ్చి చలో నల్లగొండ సభను జయప్రదం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు జీవీ రామకృష్ణారావు

వలిగొండ, ఫిబ్రవరి 12 : నల్లగొండలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, సభ భువనగిరి నియోజకవర్గ సమన్వయ కర్త సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. వలిగొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నదన్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అశాంతిని రగిలించే చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతుందని, కృష్ణానదిపై ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ హక్కులను కేఆర్ఎంబీకి అప్పజెప్పుతున్నదని తెలిపారు. గత పది సంవత్సరాల నుంచి కేంద్రం బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా కృష్ణా ప్రాజెక్టులను అప్పగించలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలకుల పోకడలు చూస్తుంటే దొంగే దొంగని అరిచినట్లు ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఉద్యమంతో తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర శాసన సభలో కృష్ణానది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పబోమని తీర్మానించడం తమ పార్టీ విజయమని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పనుమటి మమతానరేందర్‌రెడ్డి, డేగల పాండరి, మామిండ్ల రత్నయ్య, అయిటి పాముల రవీంద్ర, గూడూరు శివశాంత్‌రెడ్డి, చెరుకు శివయ్య, పబ్బు వెంకటరమణ పాల్గొన్నారు.


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనరసింహుడికి కల్యాణోత్సవ సేవ

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి12 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవ సేవ సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించారు. గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను నిర్వహించారు. సుమారు గంటన్నరకు పైగా నిత్యతిరు కల్యాణ తంతును జరుగగా భక్తులు పాల్గొని వీక్షించారు. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. స్వామివారికి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ వైభవంగా చేపట్టారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా జరిగాయి. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 13 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 27,72,618ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

16న రథసప్తమి వేడుకలు

ఈ నెల 16న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో రథ సప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ఉదయం 6.40 గంటలకు స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి తిరుమాఢవీధుల్లో ఊరేగిస్తామన్నారు. తూర్పు రాజగోపురం వద్ద చతుర్వేద పారాయణం గావించి రథ సప్తమి విశిష్టతను ఆలయ ప్రధానార్చకులు భక్తులకు వివరిస్తారని తెలిపారు. రాత్రి 7.00 గంటలకు స్వామి వారిని బంగారు రథంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగిస్తామని చెప్పారు.

15 నుంచి పాతగుట్టలో అధ్యయనోత్సవాలు

పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 18 వరకు అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నామని ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

15న ఉదయం తిరుమంజనం, సాయంత్రం తొళక్కం, 16న ఉదయం పురప్పాట్ సేవ, తిరుమంజనం, సాయంత్రం పురప్పాట్ సేవ, ప్రబంధ సేవ కాలం, 17న ఉదయం పురప్పాట్ సేవ, తిరుమంజనం, సాయంత్రం పురప్పాట్ సేవ, ప్రబంధ సేవకాలం, 18న ఉదయం నూత్తందారి చాత్మరాతో అధ్యయనోత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు. 19 నుంచి 25 వరకు 7 రోజుల పాటు పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

జిల్లా అధికారుల బదిలీ

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో బదిలీలు
- జడ్పీ సీఈఓగా శోభారాణి, డీఆర్‌డీఓగా ఎంఏ కృష్ణన్
- ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐల ట్రాన్స్‌ఫర్

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బదిలీల పర్వం కొనసాగుతున్నది. ఇటీవల డిప్యూటీ కలెక్టర్లు, తాసీల్దార్లు, ఎంపీడీఓలను బదిలీ చేయగా, తాజాగా పలువురు జిల్లా అధికారులను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జడ్పీ సీఈఓగా శోభారాణి బదిలీపై వచ్చారు. ఈమె ప్రస్తుతం టీఎస్ఐఆర్‌డీ(తెలంగాణ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్)లో పనిచేస్తున్నారు. మన దగ్గర సీఈఓగా పనిచేస్తున్న సీహెచ్ కృష్ణారెడ్డి రంగారెడ్డికి బదిలీ అయ్యారు. నల్లగొండ డీపీఓగా పనిచేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి మన జిల్లాకు డిప్యూటీ సీఈఓగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇక్కడ జడ్పీ డిప్యూటీ సీఈఓగా ఉన్న శ్రీనివాస్‌రావు నల్లగొండకు వెళ్లారు. మన జిల్లా డీఆర్‌డీఓగా ఎంఏ కృష్ణన్ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఈయన వికారాబాద్ డీఆర్‌డీఓగా ఉన్నారు. మన దగ్గర డీఆర్‌డీఓగా ఉన్న నాగిరెడ్డి నల్లగొండ డీఆర్‌డీఓగా బదిలీపై వెళ్లారు. సూర్యాపేట జడ్పీ డిప్యూటీ సీఈఓగా ఉన్న సురేశ్ మన జిల్లాకు అడిషనల్ డీఆర్‌డీఓగా వచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మూడేండ్లు ఒకే జిల్లాలో పనిచేసిన అధికారులతోపాటు, స్థానికులు ఉండరాదనే నిబంధనల మేరకు బదిలీలు చేపడుతున్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సైదులు

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సైదులు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆబ్కారీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేశారు. మన జిల్లాలో పనిచేస్తున్న నవీన్‌కుమార్ మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. ఇక సీఐలను సైతం బదిలీ చేశారు. ఈ మేరకు ఆబ్కారీ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి ఎక్సైజ్ సీఐగా పి. నరేందర్ వచ్చారు. ఈయన ప్రస్తుతం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్‌లో విభాగంలో పని చేస్తున్నారు. భువనగిరి సీఐగా ఉన్న నాగిరెడ్డికి కొల్లాపూర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. రామన్నపేట సీఐగా తుంగతుర్తి సీఐగా పనిచేసిన బాలోజీ నాయక్ ట్రాన్స్‌ఫర్ అయ్యారు. రామన్నపేటలో పనిచేస్తున్న నాగలత ఎన్ఎస్ఎల్ బోధన్‌కు బదిలీ అయ్యారు.

మెడికల్ కాలేజీని తరలించొద్దు

- బీఆర్ఎస్ నాయకుల నిరసన
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 12 : యాదాద్రి జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన మెడికల్ కాలేజీని కుంటి సాకుతో సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు తరలించడానికి ప్రయత్నిస్తున్న విధానాన్ని మార్చుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని బాబు జగ్జీవన్‌రావ్ చౌరస్తాలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీని ఇక్కడే నిర్మించాలన్నారు. జిల్లాకు కేటాయించిన మెడికల్ కళాశాలను తరలించుకుపోవాలని ప్రయత్నిస్తుంటే స్థానిక ఎమ్మెల్యేలు నోరుమెదపడం లేదని ఆరోపించారు. జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీని ఇక్కడే ఉంచాలని, లేదంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నియోజకవర్గాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జడల అమరేందర్‌గౌడ్, కొలుపుల అమరేందర్, ఎన్నబోయిన ఆంజనేయులు, ఎడ్ల రాజేందర్‌రెడ్డి, ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓం ప్రకాశ్, పెంట నరసింహ, అబ్బగాని వెంకట్, రమేశ్, రఘునందన్, భిక్షపతి, రాజశేఖర్, ఇక్బాల్ చౌదరి, నరసింహ పాల్గొన్నారు.

భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు